క్షమాగుణ సంపన్నుడు ఏసు



ఏసుక్రీస్తుకు శిలువ వేయడాన్ని స్మరిస్తూ కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని క్రైస్తవులు శుక్రవారం ఘనంగా గుడ్ ఫ్రైడే జరుపుకున్నారు. చర్చిల్లో బైబిల్ పఠనం, ప్రార్థనలు, ప్రత్యేక గీతాలు ఆలపించారు. వీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. 40 రోజుల ఉపవాస దీక్షలను విరమించి దైవ ధ్యానంలో గడిపారు. పాస్టర్లు మాట్లాడుతూ.. మానవాళి కోసం జీసస్ చేసిన మహా త్యాగమే గుడ్‌ఫ్రై డే.. కరుణామయుడు, క్షమాగుణ సంపన్నుడు ఏసుప్రభువు జీవితమే త్యాగానికి చిహ్నం. ఆ ప్రభువును శిలువ వేసిన గుడ్ ఫ్రై డే రోజు, ఆ తరువాత ఆయన పునరుత్థానం పొందిన ఈస్టర్ సండే రోజు.. ఈ రెండూ మానవాళి చరిత్రను మలుపులు తిప్పిన ఘట్టాలు అన్నారు. మానవాళి పట్ల ప్రేమ, శత్రువుల పట్ల క్షమ, అవధులు లేని త్యాగం... ఇవన్నీ తన జీవితం, బోధనల ద్వారా జీసస్ లోకానికి ఇచ్చిన సందేశాలు అని బోధించారు. – సాక్షి నెట్‌వర్క్





టేకులపల్లి: సులానగర్‌లో ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో ర్యాలీ.., కొత్తగూడెంటౌన్: సెయింట్ అంద్రూస్ చర్చిలో పార్థనలో పాల్గొన్న భక్తులు



ఇల్లెందురూరల్: కొమరారంలో...



పాల్వంచ ఆర్‌ఎం చర్చిలో..



టేకులపల్లి: సులానగర్ ఆర్‌సీఎంలో భక్తులు



ఇల్లెందురూరల్: సుంకరగూడెంలో...



సింగరేణి (కొత్తగూడెం): రామవరంలో ర్యాలీ



జూలూరుపాడులో శిలువ మోస్తున్న క్రైస్తవులు



సుజాతనగర్: ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

క్లుప్తంగా

కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారు..



మాట్లాడుతున్న మాధవ నాయక్

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం దాని అనుబంధ కార్మిక సంఘమైన టీబీజీకేఎస్ రాజకీయ స్వార్థంతో సింగరేణి కోసం పోరాటం చేస్తున్నట్లు నటిస్తోందని బీఎంఎస్ జాతీయ నాయకుడు పి.మాధవనాయక్ ఆరోపించారు. శుక్రవారం కొత్తగూడెంలోని సెంట్రల్ వర్క్‌షాపులో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి బ్లాకుల ప్రైవేటీకరణపై ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని, రాష్ట్ర ప్రజలను, కార్మికులను మంత్రి కేటీఆర్ తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. దీనికి వామపక్ష సంఘాలు కూడా అడుగులకు మడుగులు నొక్కటం శోచనీయం అన్నారు. సింగరేణి సంస్థ వాస్తవ పరిస్థితి నుంచి కార్మికులకు జీతాలు ఇవ్వాలన్నా, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలన్నా బ్యాంకుల చుట్టూ తిరిగి అప్పుల ద్వారా చెల్లిస్తున్నారని విమర్శించారు. సింగరేణి సంస్థకు రూ.కోట్లు లాభాలు వస్తున్నాయని ప్రకటిస్తున్న ఉన్నతాధికారులు రూ. వేల కోట్లు అప్పులు ఎందుకున్నాయో చెప్పాలన్నారు. సింగరేణి బ్లాకులను టెండర్ ద్వారా పొందకుండా ఒడిశాలోని బొగ్గు బ్లాకులను ఎందుకు తీసుకుంటున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీవీ కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రావు, ఎం.శ్రీనివాస్, వీరయ్య, ఎస్.రాజు, వీరకుమార్ పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

ఇల్లెందురూరల్: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు కొమరారం ఎస్సై శివరామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాలు.. మండలంలోని కొమరారం గ్రామానికి చెందిన బాదావత్ అంజలి, మహబూబాబాద్ జిల్లా దోర్నకల్ మండలానికి చెందిన కిరణ్‌తో 2013లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కొంతకాలంగా అదనపు కట్నం కోసం భార్య అంజలిని భర్త కిరణ్ వేధిస్తున్నాడు. భర్త వేధింపులు తట్టుకోలేక పుట్టింటికి చేరుకున్న అంజలి భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ కొల్లాపురం గ్రామానికి చెందిన కటారి రమేష్ శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కొంతకాలంగా కుటుంబ కలహాలతో ఇబ్బంది పడుతున్న రమేష్ మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు రమేష్‌ను వెంటనే ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మంకు సిఫారసు చేశారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగానే ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గ్రామీణ వైద్యుల సంఘం కార్యదర్శిగా నటరాజ్



టేకులపల్లి: గ్రామీణ వైద్యుల సహాయక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శిగా టేకులపల్లి మండలం బేతంపూడికి చెందిన సీనియర్ గ్రామీణ వైద్యుడు అనుగోజు నటరాజ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన సంఘం జిల్లా మహాసభలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. నటరాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడం పట్ల గ్రామీణ వైద్యులు షేక్ పాషా, ఎండీ పాషా, ప్రసాద్, శ్యామ్, రాజేశ్వర్‌రావు, బలరాముడు హర్షం వ్యక్తం చేశారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయాన్ని శుక్రవారం సూర్యాపేట జెడ్పీటీసీ వెంకటనారాయణ, పాల్వంచ జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావులు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి ఆలయ సంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి అర్చకులు అమ్మవారి శేషావస్త్ర ప్రసాదాలను అందజేశారు.

మాట తప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్



మాట్లాడుతున్న సురేష్ నాయక్

సుజాతనగర్: పోడు భూముల పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి గిరిజనుడికీ తక్షణమే పట్టాలివ్వాలని సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ సురేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో సుజాతనగర్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే చేసిన నెల రోజుల్లోనే పోడు భూములకు పట్టాలిస్తామని అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ మాట్లాడి మాట తప్పారని ఆరోపించారు. నెలలు గడుస్తున్నా రాష్ట్రంలో పోడు భూములకు పట్టాలెప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొందనన్నారు. తరతరాలుగా పోడు భూములు సాగుచేసుకుంటూ బతుకుతున్న రైతులపై అటవీశాఖ దాడులు తక్షణం ఆపాలని, పోడుభూముల పట్టాల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి తక్షణమే హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు పట్టాలెప్పుడిస్తారో స్పష్టమైన తేదీని ప్రకటించాలని, లేనిపక్షంలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. మండల అధ్యక్షుడు ప్రసాద్ నాయక్, బానోత్ నాగరాజు, హుస్సేన్ నాయక్, సీతారాం నాయక్, భావ్‌సింగ్ నాయక్ పాల్గొన్నారు.

200 పని దినాలు కల్పించాలి

టేకులపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 200 రోజుల పని దినాలు కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గొని నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐకేఎంఎస్, ఇఫ్టూ ఆధ్వర్యంలో ఈనెల 28న తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం మండలంలోని పాతర్లగడ్డ, లక్ష్మీపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశాల్లో ప్రచారం నిర్వహించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొలతలతో సంబంధం లేకుండా కూలీలకు రోజుకు రూ.750 ఇవ్వాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ కూలీల్లో విద్యావంతులు ఉంటే వారికి ప్రతినెల నిరుద్యోగ భృతి అందజేయాలని కోరారు. పని ప్రదేశాల్లో కనీస వసతులు లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. మెడికల్ కిట్లు, టెంట్, తాగునీరు, ఓఆర్‌ఎస్ తదితర సదుపాయాలు కల్పించాలన్నారు. వడదెబ్బకు గురైన వారికి రూ.5వేలు, ప్రమాదంలో మరణించిన వారికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

చలో కలెక్టరేట్ కార్యక్రమానికి కూలీలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎట్టి నరసింహారావు, రమేష్, రాజబాబు, నరేష్, బాబు, వీరమ్మ, నర్సయ్య, లక్ష్మి, సీతమ్మ, నిరోషా, నర్సయ్య, పొట్టయ్య, జోగయ్య, వెంకటమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

యువశక్తి పేరిట మోసపూరిత శిక్షణ



మాట్లాడుతున్న రాజేష్‌నాయక్

కొత్తగూడెంటౌన్: రానున్న ఎన్నికల్లో కొత్తగూడెం ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు యువశక్తి పేరిట మోసపూరిత శిక్షణ ఇస్తున్నారని లంబాడీ హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజేష్‌నాయక్, తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు కొమరం బుచ్చయ్య దొర విమర్శించారు. శుక్రవారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన గిరిజన సంఘాల నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర హెల్త్ ఇన్‌చార్జ్ గడల శ్రీనివాసరావు డాక్టర్ జీఎస్‌ఆర్ ట్రస్ట్ స్థాపించి తానే చైర్మన్‌గా వ్యవహరిస్తూ, రాజకీయ ప్రవేశం చేసి కొత్తగూడెం ఎమ్మెల్యేగా పోటీ చేయాలని శిక్షణ శిబిరాలు, వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. గిరిజన చట్టాలకు తూట్లు పొడిచి గిరిజనులకు రావాల్సిన ఉద్యోగాలను గిరిజనేతరులకు కట్టబెట్టారన్నారు. గడల శ్రీనివాస్ అరాచకాలకు, అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేసి విద్యార్థులు, స్థానిక ప్రజలు తిరగబడాలని పిలుపునిచ్చారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఉచిత వైద్యశిబిరాల పేరిట వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి నిరుపేదలకు ఉద్యోగాలు ఆశ చూపి మోసాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

ఆర్థిక సాయం

జూలూరుపాడు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి పక్షవాతం రావడంతో ఇంటికే పరిమితమైన వెంగన్నపాలెం గ్రామానికి చెందిన మెరుగు హనుమంతరావుకు స్నేహితులు శుక్రవారం ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. 1998–1999లో జూలూరుపాడు హైస్కూల్‌లో పదో తరగతి చదువుకున్న హనుమంతరావు ఇబ్బందులు తెలుసుకున్న అతని బ్యాచ్ మిత్రులు రూ.25,000 అందజేశారు. కార్యక్రమంలో మాదినేని సతీష్, ఏదులాపురం నరసింహారావు, కొలిపాక సురేష్, పెండ్యాల నరేష్, పోలూరి నరేష్, పాల్గొన్నారు.

రోడ్డుపైనే మొక్కజొన్నలు



రహదారిపై ఆరబోసిన మొక్కజొన్నలు

ఇల్లెందురూరల్: ప్రస్తుత యాసంగిలో గతంలో ఎన్నడూ లేనంతగా ఎక్కువ విస్తీర్ణంలో మండల వ్యాప్తంగా మొక్కజొన్న పంట సాగయింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొంతమేర దెబ్బతిన్నది. మిగిలిన పంటను సేకరించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే కంకులు విరిచి మిల్లులో గింజలు వేరు చేసిన రైతులు వాటిని ఎండబెడుతున్నారు. ఈ క్రమంలో మొక్కజొన్నలను రహదారులపై ఆరబెడుతున్నారు. ఏకంగా సగం రహదారిని ఆక్రమించేస్తున్నారు. మూలమలుపుల వద్ద కూడా ఇదే పరిస్థితి. కొమ్ముగూడెం నుంచి మస్సివాగు వరకు రోడ్డుపై ఆరబెట్టిన మొక్కజొన్నలే కనిపిస్తున్నాయి. కానీ ఇవే ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయి. గతంలో ఇటువంటి రహదారులపై ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. రైతులు పంట ఉత్పత్తులను ఆరబెట్టుకునేందుకు చేనులోనే కల్లం సిద్ధం చేసుకోవాలి పలువురు కోరుతున్నారు.

రంజాన్ కోసం అన్ని ఏర్పాట్లు చేయండి

ఇల్లెందు: ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ కోసం అన్ని ఈద్గాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే హరిప్రియ కోరారు. శుక్రవారం ముస్లింలతో కలిసి ఈద్గా ప్రదేశాలను సందర్శించారు. త్వరలో రానున్న రంజాన్ పండుగ నాటికి ఈద్గాల వద్ద చెత్త, చెట్లు తొలిగించి గుంతలు పూడ్చి నీటి సదుపాయం కల్పించాలని సూచించారు. అనంతరం కొత్త కాలనీలో నిర్మాణంలో ఉన్న మజీద్‌ను పరిశీలించారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, కౌన్సిలర్ సయ్యద్ ఆజమ్, కోఆప్షన్ సభ్యుడు రబ్బానీ ఉన్నారు.

తెలంగాణకు అడుగడుగునా అన్యాయం



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్రానికి అడుగడుగున అన్యాయం చేస్తున్న మోదీకి తెలంగాణలో అడుగు పెట్టొద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక శేషగిరి భవన్‌లో మీడియాతో మాట్లాడారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా గిరిజన విద్యాలయం వంటి విభజన హామీలు అమలు చేయకుండా తెలంగాణకు గుండెకాయ వంటి సింగరేణి బ్లాకులను ప్రైవేట్‌కు అప్పగించమని చెబుతూ మరోవైపు నాలుగు బ్లాకులను ప్రైవేట్ పరం చేయటానికి పూనుకున్నారన్నారు. ప్రధాన మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి తెలంగాణ కార్మికులను మోసపూరితమైన మాటలు చెప్పటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వ విధానాల వలన దేశంలో వివిధ రంగాల్లో జరుగుతున్న అన్యాయాలను దేశ సమైక్యత, సమగ్రతలను భంగం వాటిల్లే ప్రమాదముందన్నారు. భారత్ రైల్వే ప్రారంభోత్సవం సందర్భంగా హైదరాబాద్‌కు వస్తున్న మోదీకి గోబ్యాక్.. నినాదంతో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

ఐక్యత, స్నేహానికి ఇఫ్తార్ నిదర్శనం



ఇల్లెందు: ఇఫ్తార్ భోజనం వడ్డిస్తున్న హరిప్రియ



పాల్వంచరూరల్: మాట్లాడుతున్న కూనంనేని

ఇల్లెందు: ఐక్యత, స్నేహం ఇఫ్తార్‌కు నిదర్శనమని, ప్రతిఒక్కరూ సాటి వారితో సఖ్యతగా మెలగాలని ఎమ్మెల్యే హరిప్రియ, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు హరిసింగ్ నాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఐతా ఫంక్షన్ హాల్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే హరిప్రియ – హరిసింగ్ నాయక్‌లు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులో పాల్గొనటం తన అదృష్టమన్నారు. అనంతరం ముస్లింలకు స్వయంగా విందు వడ్డించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, దిండిగల రాజేందర్, పులిగిళ్ల మాధవరావు, నాదేండ్ల శ్రీనివాసరెడ్డి, పరుచూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: స్థానిక జామా మజీద్‌లో గురువారం రాత్రి ముస్లింలకు మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్కే సోందు, బి.నరసింహారావు, గోపి, రఫీ, లక్ష్మణ్, ఎస్.నరసింహారావు, హరి, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలు చేపట్టిన కఠినమైన ఉపవాస దీక్షలు వారి కుటుంబాలతోపాటు సమాజంలో శాంతి, ప్రేమను నెలకొల్పడానికి దోహద పడతాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక నటరాజ్ సెంటర్‌లోని జామా మజీద్‌లో శుక్రవారం జరిగిన ఇఫ్తార్ విందుకు కూనంనేని ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రంజాన్ పవిత్ర మాసంలో ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. ఎస్‌కే సాబీర్‌పాషా, ముత్యాల విశ్వనాథం, ఎండీ ఫయాజ్, ఇబ్రహీం, అన్వర్‌పాషా, జాఫర్, సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, అన్నారపు వెంకటేశ్వర్లు, జ్యోతుల రమేష్, షాబుద్దీన్, షకీల్, పాషా, రవి తదితరులు పాల్గొన్నారు.

పల్లె, పట్టణాల్లో చలి వేంద్రాల సందడి

- ఈసారి కరోనా లేకపోవడంతో ఆదరణ
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



రామాంజనేయ కాలనీలో చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

చుంచుపల్లి: ఏప్రిల్ ఆరంభంలోనే జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువలో ఉన్నాయి. రెండు రోజులుగా జిల్లాలో 39.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రోడ్డు మీద జనం నడవాలంటే భయపడిపోతున్నారు. జిల్లాలో మండే ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో విరివిగా అధికారులు చలివేంద్రాలను ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు. దాదాపు మూడేళ్ల తర్వాత పల్లెలు, పట్టణాల్లో మళ్లీ చలివేంద్రాలు దర్శనమిస్తున్నాయి. కరోనా భయంతో గడిచిన మూడేళ్లకాలంలో ప్రజల దాహార్తిని తీర్చే చలివేంద్రాలు ఏర్పాటుకు నోచుకోలేదు. 2020 మార్చిలో వచ్చిన తొలివిడత కరోనా వల్ల జనజీవనంతో పాటు వ్యాపార వర్గాలు, ప్రజారవాణా వ్యవస్థ స్తంభించిపోయిన విషయం తెలిసిందే. మొదటి విడతలో ప్రజలు ఒకరు ఇంకొకరితో మాట్లాడాలంటేనే భయపడిపోయారు. ఏ వస్తువు ముట్టుకోవాలన్నా వణికిపోయారు. అప్పుడు సుదీర్ఘంగా లాక్‌డౌన్ విధించడంతో ప్రజలు వేసవి సీజన్ అంతా బయటకు రాకుండా ఇళ్లలోనే గడిపారు. ఆ తర్వాత కరోనా సెకండ్ వేవ్ 2021లో ఫిబ్రవరి నుంచి మరోసారి ఉగ్రరూపం చూపింది. సెకండ్ వేవ్ కరోనా సమయంలో ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు లోనయ్యారు. ఈ సమయంలోనే ఎక్కువ మరణాలు చోటు చేసుకున్నాయి. ఈ సమయంలో ప్రజలు ఒకరినొకరు తాకాలంటే భయపడ్డారు. సెకండ్ వేవ్‌లోనూ కొంతకాలం మళ్లీ లాక్‌డౌన్ విధించాల్సి వచ్చింది. ఈ తరుణంలోనూ కరోనా భయంతో ప్రజల దాహార్తి తీర్చే చలివేంద్రాలు ఏర్పాటు చేయలేకపోయారు. ఆ తర్వాత కొన్ని నెలల వరకు కరోనా ప్రభావం తగ్గినా మళ్లీ 2022 జనవరి నుంచి ఏప్రిల్ చివరి వరకు థర్డ్ వేవ్ ప్రభావం కనిపించింది. దీంతో గతేడాది కూడా చలివేంద్రాలు అంతగా వెలవలేదు. ఈసారి కరోనా ప్రభావం పూర్తిగా తగ్గిపోవడంతో గ్రామ గ్రామాన చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. బాటసారులందరికీ చలి వేంద్రాలు దాహం తీరుస్తూ ఎండ నుంచి ఉపశమనం ఇస్తున్నాయి.

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు...

మండుతున్న ఎండల దృష్ట్యా ఈ వేసవిలో చేపట్టాల్సిన రక్షణ చర్యల గురించి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు మార్గదర్శకాలను విడుదల చేసింది. వేసవి రక్షణ చర్యల్లో భాగంగా ప్రతి గ్రామపంచాయతీలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించింది. దానిలో భాగంగా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో గత నాలుగైదు రోజులుగా పంచాయతీ సిబ్బంది చలివేంద్రాలు ఏర్పాటు చేసే పనిలో ఉన్నారు. మేజర్ గ్రామపంచాయతీలో అయితే నాలుగు, చిన్న గ్రామపంచాయతీలు అయితే ఒకటి, రెండు చొప్పున చలివేంద్రాలను అందుబాటులో ఉంచుతున్నారు. ఈ చలివేంద్రాలను జనసంచారం అధికంగా ఉండే కూడళ్ల వద్ద చలువ పందిళ్లలో ఏర్పాటు చేస్తున్నారు. ఈసారి ప్రజలు, బాటసారులు, కూలీలకు చల్లటి మంచినీటిని అందించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం చాలాచోట్ల కొత్త మట్టి కుండలతో పాటు కూల్ బబుల్స్‌ను అందుబాటులో ఉంచుతున్నారు. ప్రతి చలివేంద్రం వద్ద నిర్వహణ కోసం గ్రామ పంచాయతీ సిబ్బందిని ఉంచారు. వేసవి దాహార్తిని తీర్చేందుకు అధికారులు చేపడుతున్న చర్యల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చలివేంద్రాలతో పాటు వేసవిలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పంచాయతీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

చలి వేంద్రాలు ప్రారంభించాం ..



ఎండల దృష్ట్యా గ్రామాల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు చెప్పారు. దానిలో భాగంగా పంచాయతీలో చలివేంద్రాలను ప్రారంభించాం. జనసంచారం అధికంగా ఉన్న ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నాం. వేసవిలో చేపట్టాలన జాగ్రత్తలపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

– సరిత, సర్పంచ్, రామాంజనేయకాలనీ

నిర్వహణ బాధ్యత సర్పంచ్‌లదే..



ప్రతి గ్రామ పంచాయతీలో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చాం. ఇప్పటికే గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు వేసవిలో జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించాం. వేసవి ముగిసే వరకు చలివేంద్రాల నిర్వాహణ బాధ్యత గ్రామ పంచాయతీలు చూడాలని సూచించాం.

– రమేష్, ఎంపీడీఓ, చుంచుపల్లి

అటెన్షన్ ప్లీజ్



30 మంది విద్యార్థులకు ఒక్కడే టీచర్..

టేకులపల్లి మండలం రామచంద్రునిపేట పంచాయతీ పాతర్లగడ్డ పాఠశాల పరిస్థితి దారుణంగా ఉంది. విశాలమైన స్థలం. పాఠశాలకు రెండు భవనాలు, ఒక డైనింగ్ హాల్, పాఠశాల ఆవరణలోనే అంగన్‌వాడీ భవనం ఉన్నాయి. పాఠశాలలో మొత్తం 30 మంది ఆదివాసీ విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ ఒకే ఒక్క దివ్యాంగ ఉపాధ్యాయుడే దిక్కు. ప్రతిరోజూ 1-5 తరగతులకు ఒక్కడే బోధించడంతో పాటు విద్యాశాఖకు అందించాల్సిన రిపోర్టులు తయారు చేయడం, మధ్యాహ్న భోజనం చూసుకోవడం, పిల్లల క్రమశిక్షణ ఇవన్నీ కష్టంగా మారాయి. పాఠశాల, అంగన్‌వాడీ కలిసి ఉన్న ఈ ఆవరణకు ప్రహరీ లేకపోవడంతో రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. మరో ఉపాధ్యాయుడిని నియమించాలని, ప్రహరీ నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



– టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : ఠాకూర్ రాంసింగ్,
ఎంఈఓ, టేకులపల్లి
సెల్ నంబర్ : 9849553542